## ఫీజు పోరు విజయవంతం చేయండి : వైసిపి ఇన్చార్జ్ తిలక్

**విశాలాంధ్ర-టెక్కలి:** వైసిపి పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీకాకుళంలో ఫీజుపోరు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ కోరారు. సోమవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 12వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు టెక్కలి పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీగా బయలుదేరి శ్రీకాకుళం కలెక్టరేట్ దగ్గరకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు తల్లిదండ్రులు తో పాటు కార్యకర్తలు,నాయకులు యువకులు విద్యార్థి విభాగం సభ్యులు అందరూ హాజరయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి,నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు,ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ కుమార్ నాయక్ కు 'ఛత్తీస్ ఘడ్ జానపద పురస్కారం'



**విశాలాంధ్ర-పలాస:** చత్తీస్ ఘడ్ రాష్ట్రం రాయపూర్ లో "ఈ నెల 8,9 రెండు రోజుల పాటు ఛత్తీస్ఘడ్ ద్వితీయ తెలుగు మహాసభలు ఘనం గా నిర్వహించారు. ఆ సభలకు తెలుగు జానపదా లు తరపున ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ .కుమార్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .జానపద కళలు, నేడు వాటి మనుగడ, భావితరాలకు వాటి ఆవశ్యకత, పై ప్రసంగించారు. ఉత్తరాంధ్ర మాండలికా లు దద్ది, మొకర, నీటి ముళ్ళు, ఇరకాడు, పదాలన్నీ సజీవమై జానపదాలకు జీవం పోస్తున్నాయన్నారు. చతిస్ ఘడ్ లో ఉత్తరాంధ్ర (శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం జిల్లాల )నుండి 2 లక్షల మంది వరకు మొత్తం ఎనిమిది లక్షల మంది తెలుగు వారు ఉండటం హర్షదాయకమని నాయక్ అన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చత్తీస్ ఘడ్ రాష్ట్ర పర్యావరణ మరియు అటవీశాఖ మంత్రి మద్ది శ్రీనివాసరావు, రాయపూర్ రూరల్ ఎమ్మెల్యే బసంత్ అగర్వాల్, రాయపూర్ ఎమ్మెల్యే మోతిలాల్ సాహు, బిజెపి సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు ఆదాని పవన్ సాయి, ప్రముఖ తెలుగు సినీ కళాకారులు సాయికుమార్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

## రట్టి యాత్రకు గట్టి పోలీసు బందోబస్తు



**విశాలాంధ్ర -మందస:** మండలం రట్టి గ్రామంలో వల్లభ నారాయణ స్వామి ఆలయం వద్ద ఈ నెల 9 తేది నుంచి అయిదు రోజులు పాటు జరిగే డోలోత్సవ యాత్రకు గట్టి పోలీసు బందో బస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ .కె. కృష్ణ ప్రసాద్ విలేకరులకు తెలిపారు.యాత్ర పరిసరాల్లోని సముద్రం ఒడ్డున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడిన చర్యలు తప్పవని ప్రకటించారు.యాత్రకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నట్టు ఆయన తెలిపారు. స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శివాజీ: మందస మండలం రట్టి గ్రామంలో వెలసిన శ్రీ రట్టి వల్లభ నారాయణ స్వామిని మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ సోమవారం దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దళిత వాడల్లో మౌలిక వసతులు కల్పించండి

### డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి



**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** దళితవాడల్లో కనీస మౌలిక వసతులు లేక దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీస సౌకర్యాలు కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి కోరారు. సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దళితవాడలో స్మశాన వాటికలు లేక, వాడల్లో భౌతిక గాయాన్ని తీసుకువెళ్లేందుకు రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. గార మండలం కొర్లాం గ్రామం, టెక్కలి మండలం, ఒలియ సాగరం, లక్షన్న పేట, రాధా వల్లపురం, లింగాలవలస దోమద్రపురం, సారవకోట మండలం పెద్దలంబని, నందిగావం మండలం అరసపాడు, కోటబొమ్మాళి మండలం తులసి పేట. సంత బొమ్మాళి మండలం ఉమ్మిలాడ, పలాస మండలం బ్రాహ్మణ తర్ల, సుగుడియ, పారసంబ, మందస మండలం పొత్తంగి, పాతపట్నం మండలం లేబర, సింగపురం, జలుమూరు మండలం టి లింగాల పురం, తదితర గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు, ఇంకా మరికొన్ని గ్రామాలు వెలుగులోకి రావలసిన ఉన్నాయని ,ఈ గ్రామాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి గ్రామాలు రోడ్డు, షెడ్లు నిర్మాణాలు, నీటి సదుపా యాలు అలాగే దళిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

## సావిత్రిభాయ్ ఫూలే కు ఘన నివాళి



**విశాలాంధ్ర -కంచిలి:** కంచిలి మండలం విద్యా శాఖ కేంద్రం వద్ద సావిత్రిభాయ్ ఫూలే విగ్రహానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమం లో ఎం ఈ ఓ ఎస్ శివరాంప్రసాద్ మాట్లాడుతూ సావిత్రిభాయ్ ఫూలే చేసిన సేవలను కొనియాడారు. అలానే వివిధ సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంటి ఎస్ ఉపాధ్యాయుల అధ్యక్షుడు కామేష్ రెడ్డి,యూటీఫ్ నుండి నల్లన రవి అలానే మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే అండ్ లాండ్ రికార్డులు, హౌసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విభిన్న ప్రతిభా వంతులు, గ్రామీణాభివృద్ధి, వాటర్ రిసోర్సెస్, స్త్రీ మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, దేవదాయ శాఖ, మైన్స్ అండ్ జియాలజి శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ ఉండగా, ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో జిల్లా అధికారులందరు పాల్గొన్నారు. 141 అర్జీలు స్వీకరించారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి శ్రద్ధ వహించండి

### ఎస్పీ కెవీ మహేశ్వరరెడ్డి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం క్రైం & స్పోర్ట్స్** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో (పిజిఆర్ఎస్) స్వీకరించే పిర్యాదులు పరిష్కారానికి శ్రద్ద వహించి ఆయా పిర్యాదులు కు ప్రాధాన్యత ఇచ్చి,చట్ట ప్రకారం పరిష్కార చర్యలు చేపట్టాలి అని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి 52 మంది, పిర్యాద దారులు నుంచి అర్జులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.ఈ క్రమంలో జిల్లా ఎస్పీ వృద్దులు, వికలాంగుల అర్జీ దారులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్దిత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి అధికా రులను ఆదేశించారు. కుటుంబ తగాదాలు,ఆస్తి, ప్రాపర్టీ,సివిల్ తదితర అంశాలపై మొత్తానికి 52 వినతలు స్వీకరించారు

## 7.7 కిలోల గంజాయి పట్టివేత

### అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులు అరెస్టు

### కాశీబుగ్గ డిఎస్పి వి.వెంకట అపారావు

**విశాలాంధ్ర-పలాస:** గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి అక్రమ రవాణాకు వినియోగించిన మెటారు సైకిల్, మూడు సెల్ ఫోన్లు 3900 రూపాయలు నగదును స్వాదీనం చేసుకున్నామని కాశీబుగ్గ డిఎస్పి వి.వెంకట అప్పారావు తెలిపారు. సోమవారం కాశీబుగ్గ పోలీస్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఒరిస్సా హరువందార్ గ్రామానికి చెందిన బిసయామిన్ మజీ, అదే గ్రామానికి చెందిన హైబమజీ, ఒరిస్సా దిపిరిగుడ గ్రామం గంజాం జిల్లాకు చెందిన మైఖేల్ భద్రయటలు ఒక మోటారు సైకిల్ పై 7.7. కిలోల గంజాయి ప్యాకేట్ లను పలాస రైల్వేస్టేషన్ వైపు అక్రమ రవాణా చేస్తుండగా పలాస ఇందిరాచౌక్ వద్ద కావు కాసి వారిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. గంజాయి విలువ సుమారు లక్ష రూపాయలు వరకు ఉంటుందని, వీరు అక్రమ రవాణా చేసేందుకు ఒక్కోక్కరికి కిలోకు వెయ్యి రూపాయలు వరకు ఒప్పందం కుదుర్చుకున్నారని, గంజాయిని పండించి, రవాణాకు ఒప్పందం కురుర్చున్న వారిని ఇంకా పట్టుకోవాల్సి ఉందని తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరువచనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ సిఐ వి.సూర్యనారాయణ ఉన్నారు.

## పని భారం తగ్గించాలంటూ డిఎల్పిఓ కు దరఖాస్తు

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి :** పంచాయతీ కార్యదర్శుల పని భారం తగ్గించాలంటూ సోమవారం సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయంలో డిఎల్పిఓ వి గోప బాల, ఎంపీడీవో పి జయంతి ప్రసాద్ లకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఆర్ డి పద్మజ, సంతబొమ్మాళి మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు దుంపల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మత్తుతో చిత్తు కావద్దు

- సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడపు నాయుడు
- బీహెచ్ ఆర్సీ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడపు నాయుడు అన్నారు. నగరంలోని సోషల్ వెల్ఫేర్ శాఖ కళాశాల వసతిగృహంలో భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడపు నాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో గంజాయి జడలు విప్పి యువత, విద్యార్థులను మత్తులో ముంచేస్తుందని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువత తమ జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకుంటున్నారని తెలిపారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా సంకల్పం కార్యక్రమం ద్వారా యువతకు, విద్యార్థులకు గంజాయి, సైబర్ క్రైం గురించి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఒకప్పుడు చోరీలు, దారిదోపిడీలు, మహిళలపై అఘాత్యాలు, తగాదాలు వంటి నేరాలు ఎక్కువగా ఉండేవని, ఇప్పుడు ప్రధాన నేరాలుగా డ్రగ్స్, సైబర్ క్రైంలు ఉన్నాయని స్పష్టం చేశారు. కొందరు డ్రగ్స్ బారిన పడి నేరాలకు పాల్పడం, జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, సైబర్ క్రైం బారిన పడి చాలామంది కష్టపడి దాచుకున్న సొమ్మును పోగొట్టుకుని బాధపడుతున్నారని తెలిపారు. దేశ స్థితిగతులు మార్చ శక్తి యువతకి ఉందని, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. వాటికి దూరంగా ఉండాలని నేడు గంజాయి అనేక రూపాల్లో దొరుకుతోందని వివరించారు. చాక్లెట్, సిగరెట్, ఆయిల్, ఇంజక్షన్ తదితర రూపాల్లో గంజాయి స్మగ్లర్లు వాటిని మార్కెట్లో విక్రయిస్తున్నారని, డబ్బు ఆశ చూపి మైనర్లు, విద్యార్థులు, మహిళలను గంజాయి రవాణాకు వినియోగిస్తున్నారని చెప్పారు. గంజాయి పండించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, మత్తు పదార్థాల గురించి, సైబర్ క్రైం గురించి తల్లిదండ్రులు, చుట్టాలకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. బీహెచ్ ఆర్సీ ఆంధ్ర- తెలంగాణా రీజనల్ హెడ్ కొంక్యాన వేణుగోపాల, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంత్రి వెంకటస్వామి, జాతీయ ఉపాధ్యక్షులు తొత్తడి మణికంత, ప్రభుదేవా, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు మణిశర్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు అంధవరపు జ్యోతిర్మయి, జెసీఐ దూసి సంతోష్, హాస్టల్ ఇన్చార్జ్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణులను ప్రతి ఒక్కరూ కాపాడండి...

**విశాలాంధ్ర -హిరమండలం:** అటవీ వన్య ప్రాణులు ను ప్రతీ ఒక్కరు అటవీ ప్రాం తంలో సంరక్షణ చేసి కాపా డాలని సారవకోట పారెస్ట్ సెక్షన్ అధికారి ఎల్ ఈశ్వర్ రావు అన్నారు. సోమవారం హిరమండలం లోని కోరాడ రిజెర్వ్ పారెస్ట్ ఏరియా లో ప్రకృతి శిబిరం నిర్వహించి మండలం లోని ఆవలింగి హై స్కూల్ విద్యార్థులకు ప్రకృతి సమతుల్యత పట్ల వన్య ప్రాణులసంరక్షణ పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా ఎఫ్ ఎస్ ఓ మాట్లాడుతూ ప్రకృతి ని కాపాడాలని అలాగే అటవి ప్రాంతం లో ఉన్న జంతువులను కాపాడాలని విద్యార్థుతో సూచించారు. అటవీ ప్రాంతం లో ప్రకృతి వ్యవసాయం చక్కగా చేసుకొని నివాసం లు గా ఏర్పాటు చేసుకున్న వన్య ప్రాణులు కు ప్రాణం హాని చేయకుండా చూడాలని పిలుపు నిచ్చారు, పచ్చని చెట్లు ను నరక కూడదని చెట్లు ను పెరగ నివ్వాలని చెట్లు ప్రగతి కి మెట్లు అని కొనియాడారు. బీట్ అధికారి ఎం అజయ్, ఆవలింగి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

### ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్



**విశాలాంధ్ర -ఆమదాలవలస:** ఆమదాలవలస మండలం పరిధిలో పలు గ్రామా ల్లో సిసి రోడ్లు, బిటి రోడ్లు నిర్మాణానికి 369.50 లక్ష రూపాయలు ఎంజీఎన్ఆర్ఇజిఎస్ ద్వారా పంచాయతీరాజ్ సర్కిల్ కు మంజూరు అయినట్లు స్థానిక ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కొర్లకోట చీమలవలస ఆర్ అండ్ బి రోడ్డు నుండి హనుమంతపురం వరకు 67 లక్షల రూపా యలు, సీఎస్పీ రోడ్డు నుంచి ఎస్సర్ల పేట వరకు 69 లక్షల రూపాయలు, రామచంద్రపురం నుంచి ఆ నందపురం వరకు 130 లక్షలతో బీటీ రోడ్ల నిర్మా ణానికి నిధులు మంజూరు అయ్యాయని వివరిం చారు. అలాగే చేపేన పేట కొరపాలం లోని వివిధ మార్గాలను కలుపుతూ నాలుగు సిమెంట్ రహ దారులకు నిధులు మంజూరు అయ్యాయి. జీకే వలసలు హరిజనవాడలో ఇరువైపులా రక్షణ కూడా నిర్మాణంతో సిమెంట్ రహదారి నిర్మాణానికి 7.9 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. కొర్ల కోట లోని కొత్త కాలనీ నుంచి 26.50లక్షలు, కొత్త కాలనీ కొర్లకోట పంచాయతీ పరిధిలో 25 లక్షల రూపాయలతో డ్రైన్లు సిమెంట్ రహదారులు నిర్మాణానికి 25 లక్షల రూపాయలు మంజూరై నట్లు ఆ ప్రకటనలో వివరించారు. ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ ద్వారా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

## బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

### - అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్

- గత ప్రభుత్వంలో 650 మంది బీసీ నేతలపై తప్పుడు కేసులు
- 26 మంది బీసీలను ఊచకోత కోసింది వైసీపీ ప్రభుత్వం

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం ప్రసంగించారు. టీడీపీ అంటే బీసీలని, బీసీలంటే టీడీపీ అన్నంతగా పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి అండగా నిలిచారన్నారు. బీసీలకు రాజకీయంగా గుర్తింపు తెచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల నుంచి పుట్టుకొచ్చిన పార్టీ తెలుగుదేశం అని, బీసీల పక్షపాతిగా చంద్రబాబు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో 650 మంది బీసీ నేతలపై తప్పుడు కేసులు బనాయించారని, 2,540 మందిపై దాడులకు పాల్పడ్డారు. బీసీల సంక్షేమమే ధ్యే యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేసిందన్నారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ సంఘాలను వివిధ కులాల పేరుతో కార్పొరేషన్లను విడదీసి విధులు, నిధుల్లేని చైర్మన్లు ఇచ్చి సీఎం జగన్ పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. తమ హయాంలో ఆదరణ పథకం ద్వారా అనేక వృత్తి పరికరాలిచ్చి ఆర్థిక బలోపేతానికి కృషి చేశామన్నారు. బీసీ కార్పొరేషన్ను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. చత్తీస్ఘడ్ తెలుగు మహా సభలకు వెళ్లిన సందర్భంగా పలాస నుంచి దుర్గ్ వరకు రైలు సదుపాయాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. అలాగే అక్కడి వారికి తెలుగు వారిగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని త్వరలోనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## పరిశ్రమల స్థాపన తోనే ఆర్థిక ప్రగతి

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సత్వరమే మంజూరు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం జూమ్ ద్వారా సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కలెక్టర్ జిల్లాలోని ఆయా ఉన్నతాధికారులతో కలిసి చర్చించారు. పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధించగలమని, సింగిల్ డెస్క్ విధానం కింద కొత్తగా పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఏపీఐఐసి భూముల కేటాయింపులు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి రెండు నుంచి ఐదు ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పీఎంఈజీపి) కింద చేపట్టిన పనుల ప్రగతిని అంచనా వేసి, పీఎం విశ్వకర్మ పథకం అమలుపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి 11952 దరఖాస్తులు రాగా, 8173 మంది అర్హత సాధించారని, వారిలో 5884 మందికి శిక్షణ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 917 మందికి రుణ సదుపాయం కల్పించామని, మిగిలిన అర్హులకు కూడా త్వరగా రుణాలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంసీఎంఈ సర్వే తాజా నివేదికను పరిశీలించి, నూతన పారిశ్రామిక విధానం 4.0 మార్గదర్శకాలపై చర్చించారు. ఈ జూమ్ సమావేశంలో కన్వీనర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం, కె.విజయరత్నం, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ఎల్ డిఎం సూర్య కిరణ్, సుడా అధికారి కృష్ణ, గ్రౌండ్ వాటర్ డిడి రమణమూర్తి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణి మోహన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణశ్రీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్డీవో ను కలిసిన ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ సభ్యులు

**విశాలాంధ్ర-టెక్కలి:** రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి ని సోమవారం ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింగరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి మెమొంటోను అందజేశారు. ఇటీవల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆర్డీవో కృష్ణమూర్తి నీ ఆహ్వానించడం జరిగింది. అయితే ఆ కార్యక్రమానికి ఆయన పనులు ఒత్తిడి వలన హాజరు కాలేకపోయారు. అందుకు సోమవారం ప్రెస్ క్లబ్ సభ్యులు కలిసి ఆయనకు మెమొంటోను అందజేసి, దృశ్యాలువాతో సత్కరించి, ఏపీయూడబ్ల్యూజే డైరీ ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నర్సింగరావు ఆర్డీవో తో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకి మీడియా మిత్రులకు సరైన సమాచారం అందించడం లేదని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడం మీడియా ముఖ్య ఉద్దేశమని కావున ఈసారి ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తి వివరాలతో మీడియా మిత్రులకు అందజేయాల్సిందిగా కోరారు. ఇందుకు ఆర్డిఓ స్పందిస్తూ ఇకనుంచి పూర్తి సమాచారాన్ని అందించవలసిందిగా సీసీ నీ ఆదేశిస్తూ ఒక వారంలో పత్రికా సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగాన్ని దర్శించిన ఎమ్మెల్సీ గాదేశ్రీనివాస్ నాయుడు

**విశాలాంధ్ర-జలుమూరు:** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాకుళం జిల్లా జగన్మోహన్ మండలంలో కొలువైయున్న శ్రీముఖి లింగేశ్వర స్వామిని సోమవారం సాయంత్రం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదేశ్రీనివాస నాయుడు స్వాములు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ తెలంగాణలో ఉన్న వినాయక పలు దేవుళ్లకు ను దర్శించారు. ఆయనతో పాటు వి ఆర్ టీ యు నాయకులు ఇప్పిలి వేణుగోపాలరావు, చల్ల దుర్గా ప్రసాద్ రావు, హరి పలువురు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

### ఈఓ శాంతకమారి

**విశాలాంధ్ర- సోంపేట:** సోం పేట మేజర్ పంచాయతీ పరిధి లో ప్లాస్టిక్ కవర్లను ఎక్కడ వినియో గించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ మర్ల శాంతకుమారి హెచ్చ రించారు. ఈ మేరకు సోమవారం సోంపేటలో పలు దుకాణా ల్లో పంచాయతీ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. వివిధ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పరిశీలించి వారికి జరిమానా విధించారు. ఇప్పటికే ప్లాస్టిక్ నిషేదం విషయంలో గ్రామపంచాయతీ తీర్మానానికి కట్టుబడి కఠినచర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్లాస్టిక్ విని యోగం పూర్తిగా నిలిపి వేయాలని దండోరా వేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు. పర్యావర ణానికితీవ్ర ప్రమాదం కలిగించే ప్లాస్టిక్ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిషేదించాయని అన్నారు. ఈ నేపథ్యం లో హోటళ్లు, దుకాణదారులు, ఇతరత్రా వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు సహకరించాలని ఈఓ శాంతకుమారి కోరారు.

## నిరుద్యోగ యువత ను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

### వైసీపి సమన్వయకర్త చింతాడ

**విశాలాంధ్ర-ఆమదాలవలస:** రాష్ట్రంలోని యువతను, నిరుద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిలదీయాలని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతాడ రవికుమార్ అన్నారు. 12న నిర్వ హించనున్న యువత పోరుబాట గోడ ప్రతిని ప్రజాసేవ కార్యాలయం వద్ద సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ 12న యువత పోరు అన్ని సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిరుద్యోగులు విద్యార్థులు యువత కు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థు లను మోసం చేసిన కూటమి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి యువత పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చారని అందులో అందరూ భాగస్వా ములు కావాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకు రాలు పట్టణ మహిళా విభాగం ప్రతినిధి బొడ్డేపల్లి అజంతా కుమారి, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు గురుగు బెల్లి శ్రీనివాసరావు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బిట్టు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామల రావు, మామిడి రమే ష్, సంపద రావు రామారావు, రామకృష్ణ, పాల్గొన్నారు.

## స్పందనలో 20 వినతులు స్వీకరించిన ఆర్డీవో

**విశాలాంధ్ర-టెక్కలి:** మండల కేంద్రంలో స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 వినతులు స్వీకరించినట్లు ఆర్డీవో ఎం కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని, ధాన్యం డబ్బులు పడలేదని, త్రాగునీరు, ఇలా వివిధ సమస్యలతో వచ్చిన బాధితులకు తమ సమస్యలను అధికారులు దృష్టిలో పరిశీలించి, వెంటనే సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజీ : 2
మంగళవారం 11, మార్చి 2025

## జీడి పూతకు బూజు తెగుళ్లు..!

విశాలాంధ్ర – వజ్రపుకొత్తూరు: ఉద్దాన ప్రాంతం జీడి రైతులకు జీవనాధారం జీడి మామిడి పంట. ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు ఉద్దానం రైతులు జీడి పంటలపై పూర్తి స్థాయిలో ఆశలు పెట్టుకుంటారు. అలాంటి జీడిపూత వచ్చిన నుంచి జీడి సస్యరక్షణపై సూచనలు సలహాలు చెప్పడానికి ఉద్దాన శాఖ నుంచి అధికారులు జాడ కనిపించడం లేదని ఉద్దాన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడిపూత పై బూజు తెగుళ్ల ఎక్కువుగా ఉండడం వలన రైతులకు ఏ మందు వాడాలో తెలియని పరిస్థితి, సచివాలయం ఉద్యాన వన శాఖ సంబంధించి అధికారి ఉన్నా రైతులకు మాత్రం ఏ మాత్రం ప్రయోజనం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉద్యాన శాఖ వెంటనే స్పందించి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉద్దానం రైతులు కోరుతున్నారు.

## అలరించిన సప్తవాద్య కచేరి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ శ్రీ చక్ర ధర పెరుమాళ్ స్వామివారి డోలోత్సవాలు, తృతీయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం కార్యక్రమాల్లో భాగంగా ఉత్సవదారులు పొందల అనసూయమ్మ కుమారుడు విజయకృష్ణ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో స్వామి వారి పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటలకు భక్తి సంగీత ఆరాధన కార్యక్రమంలో భాగంగా సప్తవాద్యకచేరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మృదంగం ఆరంగి శ్రీనివాసరావు,వాయులీనం పేరి త్యాగి రాజు,సితార్ కే. నందకుమార్,వేణువు ప్రమోద్ ఉమాపతి,తబలా ఎన్.ఉదయ కుమార్, కంజీర డాక్టర్ ఆర్. శ్రీకాంత్, డ్రమ్స్ అందే బలరామ్ లతో ఏర్పాటు చేసిన సప్తవాద్య కచేరి కార్యక్రమం ఆద్యంతం సంగీత ప్రియులకు ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే సోమవారం ఏకాదశి సందర్భంగా తృతీయ బ్రహ్మోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సింహాచల ఆగమ పాఠశాల వేద పండితులు నారాయణమూర్తి శిష్య బృందం చే యాగశాల అర్చన,మండపారాధన, ధ్వజారోహణం,హెూమాలు,మంత్రపుష్పం, నీరాజనం,ఎదుర్కోలు ఉత్సవం,స్వామి వారి కళ్యాణం కార్యక్రమాలను చేపట్టారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బందరు కు చెందిన మడమల రాంబాబు భాగవతార్ చే హరికథాగానం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పి కృష్ణారావు, పి రాంబాబు,పి విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర – సంతబొమ్మాలి: సంతబొమ్మాలి గ్రామానికి చెందిన దూబ జగ్గమ్మ కుమారుడైన దూబ అప్పన్న గతంలో ట్రైన్ నుండి జారిపడడం వలన పూర్తిగా కాలు తొలగించడం జరిగింది. ఇలాంటి కుటుంబానికి ఆదుకోవడానికి విరాళ దాతలు నుండి సేకరించిన 24 వేల 400 రూపాయలు ఆ బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కానూరు ఆనందరావు టీచర్, దాచెటి నూకరాజు, చింతలపూడి అప్పన్న కొన్న వెంకటరమణ పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

విశాలాంధ్ర – సంతబొమ్మాలి: రైతులు పశువులకు ప్రభుత్వం కల్పించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోటబొమ్మాలి మండలం పశు వైద్య శాఖ అధికారి లకినాన కిరణ్ కుమార్ అన్నారు. కోటబొమ్మాలి మండలంలో పలు గ్రామాలలో సోమవారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూస్లీ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సహాయ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాకర్ల విశ్రాంతి కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు

విశాలాంధ్ర-టెక్కలి: శ్రీ సిద్ధి వినాయక వాకర్లు సంఘం వారి దాతల సహకారంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సుమారు 30,000/- రూపాయలు విలువ గల ఆరు సిమెంట్ బెంచీలను దాతల సహకారంతో సోమవారం ఏర్పాటు చేసి సంఘం అధ్యక్షులు గంగరవు మల్లేశ్వరరావు ప్రారంభించారు. ప్రముఖ మొబైల్ షాప్ అధినేత మక్క భీమారెడ్డి తన తండ్రి మక్క గణపతి రెడ్డి జ్ఞాపకార్థం మరియు మక్క గంగాధర్ రెడ్డి తన తండ్రి వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీలను అందజేసినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్లు, మహిళలు వాకింగ్ అనంతరం విశ్రాంతి తీసుకొనుటకు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని సంఘం సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కవిటి: వైకాపా ఆధ్వర్యంలో మార్చి 12వ తేదిన జరిగే యువత పోరుకు ప్రతీ ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు. రామారావు, జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయాలు తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్సీ రామారావు క్యాంపు కార్యాలయం కొత్తపుట్టుగలో యువత పోరు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముట్టడికి ప్రతీ కార్యకర్త స్వచ్ఛందంగా రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిమ్మన. దాసు,సాడి.శ్యామ్ ప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర - 2047 - జీరో పావర్టీ పీ4 విధానం ప్రారంభం

### – జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర -శ్రీకాకుళం: ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా స్వర్ణాంధ్ర ఏ 2047 కార్యాచరణలో భాగంగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన జీరో పావర్టీ-పీ4 విధానం అమలు ప్రక్రియ జిల్లాలో మొదలైందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌లో పి - 4 సర్వే గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్‌లోని పది సూత్రాల్లో మొదటి సూత్రమైన సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి ప్రారంభం కానుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజం లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా యువతకు నైపుణ్యాలతో కూడిన శిక్షణ అందించడం, ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు, సుస్థిర ఉపాధి అవకాశాల సృష్టి, వృద్ధికి దోహదం చేసే మౌళిక వసతుల కల్పనపై దృష్టిసారించేందుకు ఇది తోడ్పడుతుందని కలెక్టర్ వివరించారు. సమాజం నుంచి పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలలో సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలను భాగస్వామ్యం చేసి తమ సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా చేయడం పీ4 విధానం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంపై ప్రజల నుంచి సూచనలు తీసుకోవడం జరుగుతుందని, ఇందు విషయమై రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా https://swarnandhra.ap.gov.in/p4 లింక్ ద్వారా ఈ నెల 25వ తేదీలోగా తమ అభిప్రాయాలు/సూచనలు తెలియజేయవలసిందిగా కలెక్టర్ కోరారు. అభిప్రాయాలు/సూచనలు తెలియజేసిన వారిని ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రం కూడా వెబ్‌సైట్‌లో జెనరేట్ కాబడుతుందని కలెక్టర్ తెలిపారు.

# అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర -పలాస: అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఎన్. గణపతి, ఎస్.హైమావతి,బి.సునీత, యం.మంజుల కుమారి, డి సునీత,హేమలత తదితరులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలపై నిర్బంధానికి నిరసనగా సోమవారం పలాస ఆర్ డి ఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 42 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు కావాల్సి ఉండగా ఈ ప్రభుత్వం ఇదిగో..అదిగో అంటూ కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు కోసం మార్చి 10న విజయవాడ ధర్నాకు పిలుపునిస్తే అంగన్వాడీలను నిర్బంధించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. పాత జి ఓ లను కొత్తగా ఇచ్చినట్లు అబద్ధాలు ఆడడం మాని అంగన్వాడీల కనీస కోర్కెలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, గ్రాట్యూటి అమలు చేయాలని, యాప్ లు తగ్గించాలని, మినీ సెంటర్లని మెయిన్ సెంటర్లగా మార్చాలని, మెనూ చార్జీలు పెంచాలని, ప్రీ స్కూల్ ను బలోపేతం చేయాలని, మట్టి ఖర్చులు చెల్లించాలని, గాస్ సరఫరా చేయాలని, మెటర్నటి లీవులు ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ గారికి అందజేశారు. డిమాండ్లు పరిష్కారం కాకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బి నిర్మల, కె జ్యోతి, బి చామంతి, ఇందుమతి, జయలక్ష్మి,అప్పలనరసమ్మ, మాలతి, నాగేశ్వరి, భువనేశ్వరి, సరోజిని, తో పాటు పలాస మందస, సోంపేట,ప్రాజెక్ట్ ల నుండి అంగన్వాడీ టీచర్స్, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర -మెలియాపుట్టి: హలో పాతపట్నం చలో పిఠాపురం పార్టీ నాయకుల ఆదేశాల మేరకు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు దుక్క బాలరాజు ఒక ప్రకటనలో కోరారు. ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోటులను ఎదుర్కొని పార్టీనీ చేపట్టి మార్చి 14వ తేదీ నాటికి పుష్కరకాలం పూర్తవుతున్న నేపథ్యంలో జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న సభకు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం జరిగేలా కృషి చేయాలన్నారు. పార్టీ ఏర్పాటుచేసి దశాబ్ద కాలం పూర్తయి నేడు అధికార కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమై చేపడుతున్న మొట్టమొదటి సభనీ, ఈ సభకు నలుమూలల నుంచి వస్తున్న తెలుగువారితో పాటు, పాతపట్నం నియోజకవర్గం నుంచి కూడా పెద్ద ఎత్తున ఈ సభకు హాజరుకావాలనీ, శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త సుడా చైర్మన్ కోరికాన రవికుమార్, పాతపట్నం నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవానిల ఆదేశాలకు మేరక ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున ఈ సభలో పాల్గొని విజయవంతం చేస్తారని మెలియాపుట్టి మండల జనసేన పార్టీ నుంచి మండల నాయకులు దుక్క బాలరాజు తెలిపారు. ఈ ప్రకటన కార్యక్రమంలో బాలరాజు తోపాటు లక్ష్మీపురం కిరణ్ కుమార్, పత్రి మణికంఠ, దోల క్రాంతి కుమార్, సత్యనారాయణ రతో, తదితరులున్నారాన్నారు.

# ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ స్వయం ప్రతిపత్తి సంస్థ

### ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు

విశాలాంధ్ర – పలాస: ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ సంస్థ స్వయం ప్రతిపత్తి సంస్థ అని,దీనికి స్వశక్తితో నడచే వ్యవస్థ ఉందని ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థకు బడ్జెట్లో నిధులు కేటాయించదని, ఇది సంపద సృష్టించే సంస్థ అని, ఎవరిపై ఆధారపడే సంస్థ కాదని అన్నారు. ఆస్తులపై రాబడి వచ్చే విదంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రస్తుతం ఆరు నుంచి ఏడు కోట్ల రూపాయలు వరకు ఆదాయం వస్తుందని అన్నారు. అంతే కాకుండా తమ సంస్థలో పనిచేసిన 42 మంది సిబ్బందికి తామే జీతాలు సమకూర్చుకుంటామని ప్రభుత్వంపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. సంస్థకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం తీసుకొని తిరిగి చెల్లిస్తుంటామని తెలిపారు . పలాస ఎయిర్ పోర్టు నిర్మాణం జరిగితే కార్గో కోసం ప్రయత్నిస్తామని, ఇప్పటికే విశాఖ కార్గో కార్పోరేషన్, ప్రైవేటు బాగస్వామ్యంతో నడుస్తుందన్నారు. వీటిపై వచ్చే ఆదాయం కేంద్ర ప్రభుత్వం 60, సంస్థకు 40 శాతంగా పంచుకోవడం జరుగుతుందన్నారు. మూలపేట వద్ద పోర్టు నిర్మాణం పూర్తయితే వేర్ హౌస్ గిడ్డంగులు నిర్మించేందుకు భూములు అవసరం అవుతాయని, వీటిని రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. సంస్థ ఎండి శేఖర్ బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, జనరల్ మేనేజర్ తో కలిసి తాను ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ నుండి ఒక డైరెక్టర్ తో బోర్డు సమావేశం ఏర్పాటు చేసి విదాన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 13న చిత్తూరులో నిర్మిస్తున్న విజిటబుల్, ఫ్రూట్స్ నుంచి జ్యూస్ తీసే పరిశ్రమ 90 శాతం పూర్తయిందని, దానిని పరిశీలించి మిగిలిన పది శాతం పనులను ప్రైవేటు భాగస్వామ్యంతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకంటున్నందున పర్యవేక్షణకు వెళుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో లేపాక్షి నంది నోట్ పుస్తకాలు మార్కెట్లో లభ్యం కావడం లేదని, వాటిని తిరిగి సంస్థ ద్వారా పునఃప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకువస్తామని,సంస్థ పరిపుష్టికి చర్యలు తీసుకుంటామన్నారు.

# వేతనాల పెంపుపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి

విశాలాంధ్ర -టెక్కలి: అంగన్వాడీ లకు వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రకటన చేయాలని సిఐటియు యూనియన్ మరియు అంగన్వాడి వర్కర్లు సోమవారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్లు పెద్ద సంఖ్యలో బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచాక హామీలను ఇంకా నెరవేర్చలేదని అన్నారు. గెలవక ముందు అన్ని అమలు చేస్తానని మాట ఇచ్చి, ఇప్పుడు ఏమి చేయక చేతులెత్తడం సరికాదని మండిపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ రోజున రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ఏ ఇచ్చి మోసం చేసిందని అన్నారు. గత ప్రభుత్వమే రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచుతూ జీవో ఇచ్చారని తెలిపారు. శాంతియుతంగా చలో విజయవాడలో మహా ధర్నా చేపడితే రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్బంధలు,అరెస్టులు బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా అంగన్వాడీల కు వేతనాలు పెంచలేదని, కనీస వేతనం రూ.26 వేల నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ అంగన్వాడి సెంటర్ ను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని, ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి అంగన్వాడీ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు పోలీసులు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి బలోపేతానికి కృషి చేయాలి

### ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ రౌతు

విశాలాంధ్ర -మందస: మందస మండలంలో బిజెపి పార్టీ అభివృద్ధికి కార్యకర్తల కృషి చేయాలని జిల్లా బిజెపి నూతన అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, ఓబీసీ మోర్చా జోనల్ ఇంచార్జ్ రౌతు చిరంజీవి పిలుపునిచ్చారు. సోమవారం మందస శ్రీ వాసుదేవ ఆలయంను సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు తెలుకల సురేష్ ఆధ్వర్యంలో సుమారు 15 కుటుంబాలు బిజెపిలో చేరడంతో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మందస మండల బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ గా నెట్ సెంటర్ సాయి నియమించారు. ప్రధాని నరేంద్ర మోడీ అంకితభావంతో పనిచేస్తున్నారని అలాంటి పార్టీలో పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సవర కృష్ణ మోహన్ బాబు రమేష్ కైలాసు నరసింహులు రామారావు పద్మ చిన్న మల్లేష్ సుభాష్ షణ్ముఖరావు సింహాచలం, బమ్మిడి అప్పన్న బిజెపి టౌన్ ప్రెసిడెంట్ హడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్రావు, జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

విశాలాంధ్ర -కవిటి: కవిటి మండల విద్యావనరుల కేంద్రంలో మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే 128 వర్ధంతి కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధనుంజయ మజ్జి, మండలంలోని మహిళా ఉపాధ్యాయిణులు అంతా ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో ధనుంజయ మజ్జి మాట్లాడుతూ ఆమె మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శమని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలకృష్ణ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర -సోంపేట: రిటైర్డ్ ఎంఈఓ జన్నెల బాలకృష్ణ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించారు. సోంపేటలో గల జన్నెల బాలకృష్ణ స్వగృహానికి బూరగాం ఎంపీటీసీ ప్రతినిధి మద్దు వెంకటరావుతో కలిసి వెళ్లారు. విద్యార్థుల కోసం, సమాజ హితం కోసం ఎంతగానో తపించే బాలకృష్ణ మాస్టారు మరణించడం తీరని లోటని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నాటుసారా జోలికి వెళితే జీవితాంతం కష్టాలే

విశాలాంధ్ర -సోంపేట: నాటుసారా విక్రయించడం గాని, సేవించడం గాని ప్రమాదకరమని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కె.బేబీ తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా కంచిలి మండలం జలంత్రకోట ఎంఎస్‌పల్లి గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించి అక్కడ ప్రజలకు మరింత అవగాహన కల్పించారు. నాటుసారా రవాణా చేసినా, విక్రయించినా దాన్ని సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా వాడకం వలన ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకర సమస్యలు తప్పవని పేర్కొన్నారు. నాటుసారా జోలికి ఎవరూ వెళ్లవద్దని హితవు పలికారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## 12న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర,-జలుమూరు: జలుమూరు మండలం జోనంకి గ్రామంలో ఈనెల 12 బుధవారం శ్రీ అభయాంజనేయ స్వామి ప్రజా వార్షికోత్సవం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు ప్రతి ఏటా మార్చి 12న ఈ వార్షికోత్సవం జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు ఆలయ అర్చకులు సారవకోట విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో తెల్లవారి నుండి ప్రత్యేక పూజలు ప్రారంభమైన గ్రామస్తులు తెలిపినారు వేద పండితులు జ్యోతిష్య వాస్తు నిపుణులు అక్కా చేస్తున్న రమేష్ శర్మ ఆశీస్సులతో జరుగుతాయని తెలిపారు సాయంత్రం భజన కార్యక్రమాలు జరుగుతాయని మధ్యాహ్నం వివిధ గ్రామాలలో వచ్చిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సొండిపూడి విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర -మందస: మండలం సొండి పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఫార్మాటివ్ అసెస్మెంట్, సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలలో మొదటి రెండు స్థానాలలో విద్యార్థినిలు ప్రతిభను కనబరిచారు. ఆరో తరగతి నుండి, నగిరి శ్రీవిద్య మద్ది. రిత్విక, ఏడవ తరగతి నుండి నగిరి మహా శ్రీ ,నూకల చందు, 8వ తరగతి నుండి నగిరి పవిత్ర, జంకా నిహారిక, 9వ తరగతి నుండి మద్ది శ్రీజ, టీ. నికిత లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ సాల్మన్ మరియు సిబ్బంది చేతుల మీదుగా మెమెంటోలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ సాల్మన్ మాట్లాడుతూ సొండిపూడి పాఠశాలకు ఒక ప్రత్యేకమైన స్థానమని, చిన్నారులు ప్రతిభను ప్రోత్సహించడంలో తాము ముందుంటామని ,మిగతా విద్యార్థులు కూడా ఇటువంటి బహుమతులు అందుకోవడానికి పోటీ పడాలని కోరారు.

## 12న ఎన్ఆర్‌జిఎస్ సోషల్ ఆడిట్

విశాలాంధ్ర -జలుమూరు: జలుమూరు మండలంలో గత కొద్ది రోజులుగా ఉపాధి హామీ పనులు పైఅనేక గ్రామాల్లో జరిగిన ఎన్ ఆర్ జి ఈ ఎస్ పనులు పై జరిగిన ఆడిట్లను ఈ నెల 12 బుధవారం మండల కేంద్రంలో జలుమూరులో బహిరంగ ఆడిట్ కార్యక్రమంలో జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కే అప్పలనాయుడు తెలిపారు ప్రతి గ్రామం నుండి అక్కడ అధికారులు సర్వే పరిశీలనపై ఎక్కడ బహిరంగ విచారణ జరుగుతుందని ఇందులో పబ్లిక్ అంత పాల్గొనవచ్చు అనే ఆయన తెలిపారు.